www.prajasakti.com

ప్రజాశక్తి


ఆదివారం 13 జులై 2025 | 5 | ఏలూరు



త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -ముదినేపల్లి

మండలంలోని పెద పాలపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నూతనంగా నియమితులైన త్రిసభ్య కమిటీ శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. పెదపాలపర్రు సొసైటీ అధ్యక్షులుగా బొప్పన నాగ వెంకట నరసింహారావు, సభ్యులుగా ఆడుసుమిల్లి సుకుమార్, పల్లపోతు వెంకట నాగవర ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఆదిత్య చౌదరి, గ్రామ సర్పంచి గంటా రాకేష్ కుమార్, సొసైటీ బ్యాంకు ఖాతాదారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కమిటీకి శుభాకాంక్షలు చెబుతున్న ప్రముఖులు



కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వేపైకి చేరిన వరద నీరు



గొమ్ముగూడెంలో ట్రాక్టర్లలో సామగ్రి వేసుకుని పునరావాస కాలనీకి వెళ్తున్న బాధితులు

కొనసాగుతున్న గోదావరి వరద

గొమ్ముగూడెంలోని 100 కుటుంబాలను రావికుంట పునరావాస కేంద్రానికి తరలింపు

స్పిల్ వే నుంచి 7,43,222 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ఆందోళనలో ముంపు మండలాల ప్రజలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గోదావరికి వరద ఉధృతి శనివారం కొనసాగుతూనే ఉంది. వరద పెరగడంతో ఇప్పటికే దాచారం, కుక్కునూరు మధ్య గుండేటి వాగు కాజ్‌వేపైకి వరద నీరు చేరడంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించాయి. గోదావరికి వరద ఉధృతి పెరుగుతుండడంతో వరద ప్రభావిత గ్రామాలైన గొమ్ముగూడెంలోని 253 కుటుంబాలకు గాను 100 కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రానికి తరలివెళ్లారు. అధికారులు లచ్చిగూడెం గ్రామస్తులను సురక్షిత కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలంలో 41.3 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరుకుంది. దీంతో ముంపు మండలాల ప్రజలు, రైతుల్లో తీవ్ర అలజడి నెలకొంది. భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో గోదావరి ఉండడంతో వరద మరింత పెరిగితే ముత్యాలంపాడు వింజరం, వేలేరు, సీతారామ నగరం మధ్య రహదారులపైకి వరద నీరు చేరితే ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచే ప్రమాదం ఉంది. గోదావరి పెరుగుతుండడంతో అధికారులు లోతట్టు గ్రామాల వరద బాధితులు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని, వరద బాధితులకు అవసరమైన బియ్యం, నిత్యావసరాలు, టార్పాలిన్లు, తాగునీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని అధికారులు గ్రామాల్లో టామ్ టామ్ వేయించి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

బాధితులకు వసతి సౌకర్యాలు

మండలం గొమ్ముగూడెం గ్రామంలోని దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని శనివారం జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి పర్యవేక్షించారు. వరద బాధితులను తరలించి, ప్రజలకు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. భోజనానికి సంబంధించి నిత్యావసర సరుకులు, వంట సామగ్రిని శిబిరానికి తరలించి శిబిరంలో ప్రజలకు భోజనం అందిస్తున్నారు. తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. టాయిలెట్లు, శిబిరం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది దాచారం వరద శిబిరంలో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో వరద ప్రమాద హెచ్చరికపై టాంటాం చేస్తూ, మండలంలోని ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. జిల్లా సర్వే అధికారి అన్సారీ, తహశీల్దార్ కె.రమేష్‌కుమార్, రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, సిబ్బంది పాల్గొన్నారు.



వేలేరుపాడు రూరల్ : పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

వేలేరుపాడు రూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరికి వరద పెరిగింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 41.03 చేరింది. అయితే ప్రస్తుతం నిలకడగా ఉంది. నీటిమట్టం 45 అడుగులకు చేరితే దారిలేక సామాన్లు తరలింపునకు ఇబ్బంది పడతామని, రుద్రమకోట, రేపాకగొమ్ము, తాట్కూర్‌గొమ్ము గ్రామాల్లోని సుమారు 50 కుటుంబాలు ముందు జాగ్రత్తగా తమ సామగ్రితో భూదేవిపేట, అశ్వారావుపేట, ఆసుపాక, నెమలిపేట ఆర్అండ్ఆర్ కాలనీలకు వెళ్లిపోతున్నారు.



వేలేరుపాడు రూరల్ : పునరావాస కేంద్రానికి తరలిస్తున్న సామగ్రి

రహదారి సౌకర్యం లేని 18 గ్రామాలు..

వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద న్న కాజ్‌వే మునిగిపోవడంతో రహదారి సౌకర్యం లేక కట్కూరు, కోయిదా, టేకూరు, సిద్దారం, కాకిసునూరు, ఎడవల్లి తదితర 18 గ్రామాల ప్రజలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తమ తమ అవసరాల కోసం మండల కేంద్రాన్ని చేరుకోవాలంటే ఆ కాజ్ వే మీద నుంచి ప్రయాణం చేయాలి. కాజ్‌వే మునిగిపోవడంతో పడవ దాటి వేలేరుపాడు చేరుకోవాలని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పునరావాస శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి : ఆర్‌డిఒ

మండలంలో వరద ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సహాయ పునరావాస కార్యక్రమాలను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయరాజు శనివారం దగ్గరుండి పర్యవేక్షించారు. ముందుగా వరద ప్రభావానికి గురైన రేపాకగొమ్ము గ్రామస్తులను తాడువాయిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వరద సహాయ పునరావాస శిబిరానికి తరలించారు. అనంతరం వేలేరుపాడు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ రమణ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి పునరావాస కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. వరద పునరావాస శిబిరాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. టార్పాలిన్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పునరావాస కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేదన్నారు. పునరావాస కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు, వైద్య శిబిరంలో సేవలను ఆర్‌డిఒ రమణ, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయరాజు పరిశీలించారు. తహశీల్దార్ జి.సత్యనారాయణ, రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, పోలీసు, ఆర్‌డబ్ల్యుఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం: పోలవరంలో గోదావరి నీటి మట్టం శనివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 7,43,222 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.430 మీటర్లు, దిగువన 22.600 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాం ఎగువన 31.900 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం దిగువన 22,050 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యాం మధ్య 16.080 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు దిగువన 10.78 మీటర్లు నమోదైందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి. గోదావరి లంక భూములు నీటమునిగాయి. గండిపోశమ్మ ఆలయం నీటమునగడంతో ఆలయానికి రాక పోకలను అధికారులు నిలిపివేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వరద తగ్గే వరకూ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకుంటున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు ప్రమాదం ఉన్న గ్రామస్తులందరికీ వరద ముంపు ప్రమాదాన్ని తెలియజేసి, వెంటనే వరద సహాయ పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వరదల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు నదిలోకి చేపలు పట్టేందుకు వెళ్లకుండా చూడాలన్నారు. గర్భిణులను దగ్గరలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన ట్యాంకర్లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పునరావాస కేంద్రంలో వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరద నీరు ఉధృతంగా ప్రవహించే కల్వర్టులు, కాజ్‌వేలు, రహదారులను ముందస్తుగా మూసి ఉంచడంతోపాటు ప్రజలు ప్రయాణించకుండా ఆ ప్రాంతాలలో సిబ్బందిని నియమించాలన్నారు. వరదల కారణంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ముంపు ప్రాంతాలకు రాష్ట్ర విపత్తు నివారణ దళం

కుక్కునూరు, వేలేరుపాడు : జిల్లా గోదావరి వరద ఉధృతి దృష్ట్యా సహాయక చర్యల నిమిత్తం రాష్ట్ర విపత్తు నివారణ దళం ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు చేరుకుంది. కుక్కునూరు మండలానికి 35 మందితో కూడిన బృందం, వేలేరుపాడు మండలానికి 35 మందితో కూడిన బృందం అత్యవసర సమయాలలో సేవలందించేందుకు చేరుకున్నాయి. వరద సహాయ పునరావాస కేంద్రాలలో ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో, రుచికరమైన భోజనం అందించడం జరిగిందని జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి చెప్పారు. దాచారం ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద సహాయ పునరావాస కేంద్రంలోని ప్రజలకు శనివారం భోజనాలను అధికారులు వడ్డించారు. పునరావాస కేంద్రంలోని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. వరద ముంపు ప్రభావం తగ్గేవరకూ ప్రజలను పునరావాస కేంద్రాలలో ఉంచడం జరుగుతుందన్నారు. పునరావాస కేంద్రంలో ప్రజలు అధిక సంఖ్యలో ఉంటున్న కారణంగా పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ను ఇస్తున్నారు. ఎక్కడా చెత్త లేకుండా, మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రం చేస్తున్నారు. కుక్కునూరు మండలంలోని ముంపు ప్రమాదం ఉన్న గ్రామాలలోని ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ పనులు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు కూడా జోరుగా పడుతుండడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వరి నాట్ల సందడి మొదలైంది. పొలం బాగు చేసుకుని దమ్ము చేసి కూలీలతో పనులు చేయిస్తున్నారు. పొలాలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. మండలంలో రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఒకవైపున కల్తీ విత్తనాలు, ఎరువుల అమ్మకాలు జరగకుండా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. సమయానికి నగదు లేకపోయినా వడ్డీకి పెట్టుబడులు తెచ్చి సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయనే ఆశతో రైతులు సాగును ప్రారంభిస్తున్నారు. చెరువుల్లో నీరు లేకపోయినా ముందుకు సాగుతున్నారు.



వరి నాట్లు వేస్తున్న కూలీలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వీరభద్రపురం వాసుల ధర్నా



ధర్నా చేస్తున్న వీరభద్రపురం వాసులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని రెడ్డి గణపవరం పంచాయతీ శివారు వీరభద్రపురంలో గత మూడు రోజులుగా తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి, రెడ్డి గణపవరం మాజీ ఎంపిటిసి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. ఈ మేరకు వీరభద్రపురం గ్రామస్తులు శనివారం చేసిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెడ్డి గణపవరం సచివాలయానికి రెగ్యులర్ కార్యదర్శి లేరన్నారు. పలుమార్లు మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయని, కార్యదర్శి లేకపోవడంతో పంచాయతీలో తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. వ్యవసాయ కూలీలు పనులకెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి తాగునీరు ఉండడంలేదన్నారు. కనీసం అన్నం వండుకునేందుకు కూడా తాగునీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మూడు రోజుల నుంచి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటార్‌కు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నేలపాల ఆటలమ్మ, సుజాత, సరోజిని, వీరమ్మ, వెంకట్, మారయ్య, రమణ, సీతయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఉపాధి కూలీల ధర్నా



వ్యకాస ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేదలకు పట్టె డన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని పాలకవర్గాలు కుట్ర చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. శనివారం ఉపాధి హామీ కూలీలు, పేదలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏలూరులోని సంఘం జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలని కోరారు. మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల కూలీలు అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో కూడా పేదల కుటుంబాలకు వేతనం లేకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలన్నారు. ఒక పక్క వ్యవసాయ పనులు క్రమేపీ తగ్గిపోతున్నాయని, రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న పేదలకు వంద రోజుల ఉపాధి పనులే దిక్కౌతున్నాయనీ, పొమ్మన లేక పొగపెట్టే తీరుగా ప్రభుత్వాలు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా వంద రోజులు పనులు చూపించాలంటే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.83 వేల కోట్లు మాత్రమే కేటాయించి, మంజూరు చేయడంలో కొర్రీలు పెడుతోందని విమర్శించారు. మరోపక్క అంబానీ, అదాని వంటి ప్రపంచ కోటీశ్వరులకు బ్యాంకుల్లో రూ.12 లక్షల కోట్లకుపైగా అప్పులు రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కోత వల్ల కనీసం 30 రోజులకు కూడా పనులు దక్కడం లేదని ఆరోపించారు. పని చేసిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా 3 నెలలు అవుతున్నా నేటికీ వేతనలివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ రోజు కూలీ డబ్బులతో ఆ పూట గడిచే కుటుంబాలకు వంద రోజులైనా వేతనాల్వికుంటే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, యు.వెంకటేష్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జ్యూడిషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కె.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయమూర్తులు కేసులను త్వరితగతిన విచారించి తీర్పులు వెలువరించాలని, ఈ క్రమంలో తీర్పుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. అలాగే సివిల్ కేసులు, విచారణలో ఉన్న ఖైదీల కేసులను త్వరితగతిన తీర్పులను వెలువరించడానికి ప్రయత్నించాలన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసుల వివరాలు, భవన సముదాయాల పరిస్థితులపైన వివరించారు. ఈ సమావేశంలో జిల్లాలోని జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, పాల్గొన్నారు.

ఎర్ర చెరువులో పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి

మంత్రి నిమ్మల రామానాయుడుకు కొండపల్లి రవి వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక ఎర్రచెరువులో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి వినతిపత్రం అందించారు. ఈ మేరకు మంత్రి నిమ్మల రామానాయుడును పాలకొల్లు క్యాంపు కార్యాలయంలో రవి శనివారం కలిశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సుమారు 60 సంవత్సరాలుగా ఎర్రచెరువు ప్రాంతంలో వంద కుటుంబాలపైన నివాసం ఉంటున్నారని, వారికి ప్రభుత్వం పక్కా గృహాలు కూడా మంజూరు చేసిందని, వారికి ఇంటిపన్నులు, కుళాయి బిల్లులు, కరెంటు బిల్లులు కూడా ఉన్నాయని చెప్పారు. గతంలో కొంతమంది అధికారులు వేరే సర్వే నెంబర్ వేసి తాత్కాలికంగా కొంతమందికి పట్టాలు అందించారని, కాని ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కొత్త గృహాల నిర్మాణం కోసం ఆన్‌లైన్ చేయగా పట్టాలు లేని కారణంగా ఆన్‌లైన్ అవ్వడం లేదన్నారు. సంవత్సరాల తరబడి ఇక్కడే నివాసం ఉంటున్న వారికి శాశ్వతంగా పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ చెరువు వల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేవని, అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రవి

కోకో బోర్డు ఏర్పాటు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - దెందులూరు

రాష్ట్రంలో కోకో బోర్డు ఏర్పాటు చేయాలని కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదవేగి మండలంలోని వంగూరులో కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో కోకో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కోకో రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పానుగంటి అచ్యుతరామయ్య అధ్యక్షత వహించారు. సదస్సులో కోకో రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోకో పంటను మరింతగా ప్రోత్సహిస్తామని, ప్రస్తుతం ఉన్న 75 వేల ఎకరాలకు అదనంగా మరో లక్ష ఎకరాల్లో కోకో పంట సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తామని ప్రకటించిందన్నారు. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న కోకో గింజలను మార్కెట్లో అమ్ముకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో లక్ష ఎకరాలు పెంచితే ఆ పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. విదేశీ కోకో గింజలు దిగుమతులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చేలా ఫార్ములా రూపొందించి కోకో గింజలకు ధర నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుదిబండి వీరారెడ్డి మాట్లాడుతూ కోకో రైతులంతా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పడి భవిష్యత్తులో తమ కోకో గింజలను మార్కెటింగ్ చేసుకునేలా కోకో రైతులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి వాసు, పానుగంటి నరేష్, కొండపల్లి సత్యనారాయణ, గోపిశెట్టి శ్రీనివాస్, సింహాద్రి సతీష్, ఏపూరి శ్రీనివాసరావు, కొట్టే సురేష్, మామిళ్లపల్లి వెంకట్రావు, పానుగంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నేతలు

సమ్మేళనం ఆర్భాటం.. సమస్యలు అపరిష్కృతం

విద్యార్థుల ప్రగతి వివరించేందుకు, విద్యాప్రమాణాలు పెంచేందుకు నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనాలు అద్భుతంగా ప్రచార ఆర్భాటంగా సాగాయి. అయితే విద్యాప్రమాణాల మెరుగుకు కీలకమైన సమస్యల పరిష్కారంపై చర్చకు అవకాశం ఇవ్వకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. పోలవరం నిర్వాసితుల కష్టాలు, వరద గోదావరి ఉగ్ర రూపంతో మరోసారి తెరపైకి వచ్చాయి.



మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కృషి ఫలితంగా విజయవంతంగా సాగాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కూటమి నేతలు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో పాఠశాలన్నింట్లో సందడి నెలకొంది. అయితే ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ఏకరువు పెట్టారు. తమ ప్రభుత్వం తల్లికివందనం, నిధులు ఇచ్చిందని, రాజకీయ ప్రచారానికి సైతం తెర లేపారు. అయితే ఆయా పాఠశాలల పరిధిలో ఉన్న సమస్యల గురించి కనీస ప్రస్తావన గాని, చర్యలు గాని చెప్పకపోవడం గమనార్హం. చాలా పాఠశాలల్లో కొన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడం, భవనాల సమస్య, ఆటస్థలాల కొరత వంటి సమస్యలు చాలా కాలంగా ఉన్నాయి. వీటి పరిష్కారానికి ఏం చేయదలుచుకున్నారో కూడా కనీస హామీలు ఇవ్వని పరిస్థితి. విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో ఉపాధ్యాయ పోస్టులు పెద్దసంఖ్యలో ఖాళీ ఉన్నాయి. దీనిపై ఇప్పటికే ఆ ప్రాంత విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రధానంగా సమస్యలు ఎక్కు వగా ఉన్న పాఠశాల వైపు ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అదే సమయంలో కొన్నిచోట్ల ప్రయివేట్ పాఠశాలల్లో కార్యక్రమా లకు హాజరైన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలకు సాయంత్రం సమయాల్లో వెళ్లడం పలు విమర్శలకు కారణమైంది. ఇదేనా ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న ప్రేమ అని పలు ఆరోపణలు వెల్లువెత్తాయి.

జులై రెండోవారంలోనే వరద గోదావరి ఉరకలు వేస్తుంది. ఈ క్రమంలో విలీన మండలమైన వేలేరుపాడులోని ముంపు బాధితుల కష్టాలు మరోసారి తెరపైకి వచ్చాయి. నిర్వాసితులు తమకు పరిహారం ప్యాకేజీ చెల్లించి పునరావాస గ్రామాలకు తరలించాలని చాలాకాలంగా కోరుతున్నారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు, నేతలు, ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడం తప్ప కార్యాచరణకు చర్యలు లేకపోవడంతో ప్రతి ఏటా మూడు నెలల పాటు ముంపు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సివస్తోంది. ఇప్పటికైనా ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు, హామీలు మాని చట్ట ప్రకారం నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం ప్యాకేజీ ఇవ్వడంతో పాటు పునరావాస గ్రామాల నిర్మాణం పూర్తి చేసి తమకు తరలించాల్సిందిగా కోరుతున్నారు. లేకపక్షంలో ప్రతి ఏటా నిర్వాసితులకు ఈ దుస్థితి తప్పని పరిస్థితి కనిపిస్తుంది.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

సిపిఎం నాయకులను బెదిరిస్తే సహించం

మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ నుంచి సిపిఎంలోకి వచ్చిన వారిని బెదిరిస్తే సహించేది లేదని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనసేన పార్టీ నుంచి రూపా సత్యనారాయణ, ఎస్.రాము, రాఘవ, రామ్‌ప్రసాద్, అంజి తదితరులు సిపిఎంలో చేరారని తెలిపారు. ఈ చేరికను జీర్ణించుకోలేక జనసేన పార్టీకి చెందిన నాయకులు కొందరు ఊరు పేరు లేని పత్రికల్లో జనసేన పార్టీ ప్రెసిడెంట్ పసుపులేటి రాము పేరు మీద పత్రిక ప్రకటన రావడం సిగ్గు చేటని పేర్కొన్నారు. వెంటనే అలాంటి అబద్ధపు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని తెలిపారు. అధికారం చూసుకుని సిపిఎం నాయకులను బెదిరిస్తే సహించేది లేదని పేర్కొన్నారు.

బస్‌స్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి బస్‌స్టేషన్‌ను జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారిణి షబ్బం శనివారం సందర్శించారు. బస్టాండ్ ప్రాంగణం అంతా కలియతిరిగి పరిశీలించారు. బస్ స్టేషన్‌లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఏలూరు ఆర్‌టిసి డిపో ఆఫీసర్ వాణిని ఆదేశించారు. మరుగు దొడ్ల పైపులైను ఏర్పాటు చేయాలని, పాడైన సెప్టిక్ ట్యాంక్ స్థానంలో నూతన సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లోని వ్యాపారులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న కారణంగా కాంట్రాక్టర్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టడంతో బస్సులు లోపలికి రావడం లేదన్నారు. ప్రయాణికులు లోపలికి రాకపోవడంతో వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి పిఆర్‌ఒ కెవిఎస్.నరసింహం, కంట్రోలర్ ఎం.కోటేశ్వరరావు, దుకాణదారులు విజయసాగర్, మాజీ జెడ్‌పిటిసి భూపతి రవీంద్ర పాల్గొన్నారు.

జాగ్రత్తలతో డెంగీని నివారించొచ్చు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతిఒక్కరూ చిన్న చిన్న జాగ్రత్తలు పాటించటం ద్వారా డెంగీని నివారించొచ్చని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.ప్రసాద్ సూచించారు. డెంగీ మాసోత్సవంలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి జె.కల్యాణరావి అధ్యక్షతన వైద్య సిబ్బంది అందరికీ డెంగీ నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆసుపత్రి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ, ప్రదర్శన మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేయడం, దోమ కాటుకు గురికాకుండా చూసుకోవడం, దోమ తెరలు వాడటం, వ్యర్థ పదార్థాలు లేకుండా చూసుకోవడం, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా డెంగీ వంటి వ్యాధుల నుంచి బయట పడొచ్చన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఇఒ.మైసమ్మ, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.3.50 లక్షలు మంజూరు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన పేచ్చేటి వీరాంజనేయులు, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడ క్యాపిటల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. కిడ్నీ మార్పిడి చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. కాని వారికి వైద్యం చేయించుకోవడానికి అంత ఆర్థిక స్తోమత లేదని స్థానిక నాయకులు గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు వెంటనే సిఎం సహాయ నిధి నుంచి రూ.3.50 లక్షలు మంజూరు చేయించారు. సంబంధిత పత్రాలను శనివారం బాధితుడికి, హాస్పిటల్ సిబ్బందికి నాయకుల ద్వారా అందించారు. వారి కుటుంబ సభ్యులు కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడటంతో కిడ్నీ మార్పిడి చేయడానికి హాస్పిటల్ వారు ఏర్పాటు చేశారు. వెంటనే స్పందించి సిఎం సహాయ నిధి నుంచి రూ.3.50 లక్షలు మంజూరు చేయించినందుకు ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజుకు రామన్నగూడెం గ్రామ నాయకులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రామన్నగూడెం నాయకులు, మద్రాస్ రాము, పార్టీ గ్రామ అధ్యక్షులు కమ్మ సత్యనారాయణ, బిసి నాయకులు, పార్టీ బుట్టాయగూడెం అధ్యక్షులు, కేతగౌరీశ్వరరావు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భూ సేకరణపై అభ్యంతరాలు తెలపండి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా పోలవరం ముంపు నిర్వాసితులకు సేకరిస్తున్న భూ సేకరణకు భూములు ఇచ్చే రైతులకు అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్ భాస్కర్ రైతులకు సూచించారు. మండలంలోని తాటియాకులగూడెం, జీలుగుమిల్లి పంచాయతీల్లో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తాటియాకులగూడెం పంచాయతీలో 130 ఎకరాలు, జీలుగుమిల్లి పంచాయతీలో 117 ఎకరాల భూమి ఇవ్వడానికి రైతులు ముందుకు వచ్చినట్లు తహశీల్దార్ ఉదయ్ తెలిపారు. వారికి గ్రామసభ నిర్వహించి మార్పులు చేర్పులు ఉంటే తెలపగలరని సూచించారు. మండలంలో ఎటువంటి వివాదాలు లేని జిరాయితీ భూములను మాత్రమే తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఎకరానికి సుమారు రూ.15 లక్షల వరకు పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఏలూరు నగరంలోని శాంతినగర్ ప్రాంతంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని శాంతినగర్ మూడో రోడ్డులో ఉన్న ఓపెరా అపార్ట్‌మెంట్‌లో దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన పి.శ్రీనివాస్ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. శనివారం ఉదయం సమయంలో ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన భార్య పోలీసులకు సమాచారం ఇచ్చింది. మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం... పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామానికి చెందిన డి.రమేష్ (40)కు, అతని భార్యకు మధ్య తలెత్తిన మనస్పర్థల నేపథ్యంలో మూడేళ్లుగా భార్య ఆమె పుట్టిల్లు అయిన కలపర్రులో పిల్లలతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో పది రోజుల క్రితం భార్యాభర్తల విషయమై పెద్దల మధ్యలో సంధి జరిగింది. సంధి జరిగిన తర్వాత రమేష్ న్యాయంపల్లి నుంచి కలపర్రు వెళ్లి అక్కడే వారం రోజులు ఉన్నాడు. అనంతరం ఈ నెల పదో తేదీ శుక్రవారం న్యాయంపల్లికి తిరిగి వచ్చాడు. తెల్లవారుజామున అతను వాంతులు చేసుకుంటూ ఉండడంతో పురుగుమందు తాగాడని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

సారా అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. మండలంలోని పంతంగలగూడెంలో ఎక్సైజ్ అధికారులు శనివారం చేసిన దాడిలో శిరీషాకు సంబంధించిన 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆ మహిళకు బెల్లం సరఫరా చేసిన వ్యక్తి హాసవతు లక్ష్మీ కుమారి వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారా, ఐదు కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఐదు మేకలు మృతి

ఆగిరిపల్లి : మండల పరిధిలోని వడ్లమాను గ్రామంలో సాదం స్వామి అనే పశువుల కాపరికి చెందిన ఐదు మేకలు వింత వ్యాధితో మృతి చెందాయి. విషయం తెలుసుకున్న నూజివీడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కె.నరసింహారావు, ఆగిరిపల్లి పశువైద్యాధికారి హనుమంతరావుతో మృతి చెందిన మేకలను పరిశీలించారు. మిగతా మేకల రక్త నమూనాలు సేకరించటంతో పాటు, వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఈ మేకల మృతికి న్యూమోనియా వ్యాధి కారణం కావచ్చని చెప్పారు. గ్రామంలో ఐదు రోజుల పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి


ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు

చిట్‌చాట్

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మండలంలోని 16 గ్రామాల ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నామని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు చెప్పారు. పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపిన ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.


ఎంఇఒ సుబ్బారావు

ప్రశ్న : ముసునూరు మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి? ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు?

ఎంఇఒ : మండలంలో మొత్తం 62 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 3,226 మంది విద్యార్థులు, 212 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రశ్న : మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫామ్‌లు అందాయ్యా?

ఎంఇఒ : 95 శాతం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫామ్ అందించాం.

ప్రశ్న : గత ప్రభుత్వంలో నాడు-నేడులో ఎంపికైన పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయా?

ఎంఇఒ : నాడు-నేడు పనులు ఒకటి, రెండు పాఠశాలల్లో తరగతి గదులు తప్ప, మిగతావన్ని పూర్తియ్యాయి.

ప్రశ్న : పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు ఎలా నడుస్తున్నాయి. ఇంగ్లీషు మీడియం ఏ విధంగా బోధిస్తున్నారు?

ఎంఇఒ : ఇంగ్లీషు మీడియం తప్ప,తెలుగు మీడియంలో ఎవరు చదవడం లేదు. డిజిటల్ క్లాసులు కుడా నిర్వహిస్తున్నాం. విద్యార్థులు కుడా ఇంగ్లీషు మీడియం చదువుకు ఎక్కువ మక్కువ చూపుతున్నారు.

ప్రశ్న : ముసునూరు మండలంలో ఎన్ని ప్రయివేట్ పాఠశాలలు నడుస్తున్నాయి?

ఎంఇఒ : మండలంలో ఏడు ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి.

ప్రశ్న : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఏ విధమైన కృషి చేస్తున్నారు?

ఎంఇఒ : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువించాలని కోరుతున్నారు. ఇందకు వారికి అవగాహన కల్పిస్తున్నాం.

అత్యాధునిక అత్యుత్తమ ప్రమాణాలతో ఐటిఐ కోర్సులు

15 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఎస్‌పిఎం ఐటిఐ ప్రిన్సిపల్ సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రస్తుతం సమాజంలో ఆధునిక టెక్నాలజీ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి కలిగి ఉండేలా గత ఎనిమిదేళ్ల నుంచి డిజిటల్ ఐటిఐను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని ముదినేపల్లి ఎస్‌పిఎం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రస్తుతం ఏలూరు జిల్లాలోనే డిజిఇ అండ్ టి సెంట్రల్ గవర్నమెంట్‌చే ఉత్తమ గ్రేడింగ్ పొందిన సంస్థగా ఎస్‌పిఎం ఐటీఐను తీర్చిదిద్దామన్నారు. అత్యుత్తమ ప్రమాణాలతో డిజిటల్ వర్క్ షాపులు ఆధునిక సాంకేతిక పరికరాలతో శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా అడ్మిషన్లకు అవకాశం ఉండడంతో విద్యార్థులు ఇటువైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐటిఐలో రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల 15వ తేదీతో దరఖాస్తులు ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఈ నెల 23వ తేదీతో అడ్మిషన్ల ప్రతిభ ఆధారంగా ప్రభుత్వం


ప్రిన్సిపల్ సత్యనారాయణ

ఏర్పాటుచేసిన పరిశీలకులు వారిని ఎంపిక చేస్తారన్నారు. కృష్ణా, ఏలూరు గోదావరి జిల్లాల్లోని ప్రయివేట్ ఐటిఐల్లో దాదాపు 20 సంవత్సరాల అనుభవం కలిగిన అధ్యాపకులకు రాష్ట్రంలో అత్యధిక జీతాలు ఇస్తున్న ఐటిఐల్లో స్పామ్ ఐటిఐ ఒక్కటన్నారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రతి ఏటా అధ్యాపకులకు ఇంక్రిమెంట్ ఇస్తున్నామన్నారు. స్పామ్ ఐటిఐను దేశంలో ఉన్న స్కిల్ ఇండియా ద్వారా నడుపుతున్నట్లు చెప్పారు. ఐటిఐలో ప్రవేశాలు పొందే విద్యార్థులు తమ తల్లిదండ్రులను వెంట తీసుకువచ్చి ఎక్విప్‌మెంట్ ఉన్నదీ లేనిదీ పరిశీలించి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగించాలనే ఉద్దేశంతో సరికొత్త కంప్యూటర్లతో శిక్షణ ఇస్తున్నామన్నారు. కంప్యూటర్ బేసిక్ టెస్ట్, ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, పిట్టర్ ట్రేడుల్లో శిక్షణా తరగతులకు అత్యాధునిక నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, అధ్యాపకురాలతో మెరుగైన శిక్షణ ఇస్తున్నామన్నారు. షెడ్యూల్ తరగతులకు సంబంధించిన విద్యార్థులు కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల నుంచి ఎక్కువ మంది వచ్చి స్పామ్ ఐటిఐలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఇప్పటికే దరఖాస్తుల ఆధారంగా స్పామ్ ఐటిఐలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ ట్రేడ్ కోర్సులు సీట్ల భర్తీ పూర్తయిందన్నారు. ఇంకా డీజిల్ మెకానిక్ సీట్లు కొద్ది మేర భర్తీ కావాల్సి ఉందన్నారు. ఎనిమిది యూనిట్లు ఉన్నాయన్నారు. ఒక్క యూనిట్‌కు 20మంది విద్యార్థులు, మొత్తం 160 మందికి ప్రవేశం ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన వెంటనే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి పేద, మధ్యతరగతి విద్యార్థులు ఏ విధమైన అధిక ఫీజులు లేకుండా కేవలం ప్రభుత్వం వారి నిర్ణయించిన ఫీజు ప్రకారం ప్రభుత్వ ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా ఉచిత శిక్షణ పొందవచ్చన్నారు. రాయితీతో కూడిన బస్సు పాస్, ట్రైన్ పాస్ కలవన్నారు. దూరపు విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్‌లో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఈ సదవకాశాన్ని కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సత్యనారాయణ కోరారు.

కల్లులో మత్తు పదార్థాలు కలపొద్దు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కల్లులో ఎటువంటి మత్తు పదార్థాలను కలపకూడదని ఎక్సైజ్ సిఐ మస్తానయ్య తెలిపారు. నూజివీడు ఎక్సైజ్ స్టేషన్‌లో కల్లు సొసైటీ ప్రెసిడెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో ఏమైనా కార్డులు కావాలన్నా సమస్యలు ఉన్నా సంప్రదించాలన్నారు. అనంతరం చొప్పరమెట్ల టిసిఎస్, గోపవరం టిసిఎస్, సీతారాంపురం టిఎఫ్‌టి సొసైటీల్లో కల్లును శాంపిల్‌గా తీశామని, తీసిన శాంపిల్‌ను కాకినాడ కెమికల్ ఆఫీస్‌కు పంపిస్తామని, ఆ శాంపిల్‌లో కల్లు కాకుండా వేరే మత్తు పదార్థాలు కలిశాయని నివేదిక వస్తే ఆ సొసైటీని రద్దు చేస్తామని హెచ్చరించారు.

క్రికెట్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ శనివారం విద్యార్థులకు క్రికెట్ కిట్లు అందించారు. ముదినేపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద ముదినేపల్లికి చెందిన పలువురు విద్యార్థులకు క్రీడలను ప్రోత్సహిస్తూ పిల్లలకు క్రికెట్ కిట్లు అందించారు.

బీమా సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా సౌకర్యాన్ని రైతులు, కౌలు రైతులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు చాముండేశ్వరి సూచించారు. నూజివీడులో చాముండేశ్వరి శనివారం మాట్లాడుతూ పంటల బీమా పథకంలో 2025వ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం ఫసల్ భీమ యోజన, ఆర్‌డబ్ల్యు బిసిఐఎస్ వంటి పథకాలను పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సేవకులను సంప్రదించవచ్చన్నారు.

నూజివీడులో అన్నదానం

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణ పరిధిలోని శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలో సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత ఉపాధ్యాయురాలు మాడుగుల రమ్యశ్రీ, నూజివీడు, మైలవరం, రెడ్డిగూడెం, విజయవాడ, భీమవరం, సత్తుపల్లి ప్రాంతాల నుంచి యాత్రికులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన, స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

మిడ్డే మీల్ వర్కర్స్, స్కూల్ స్వీపర్స్ సమస్యలు పరిష్కరించి, కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు మండలాధ్యక్షులు, కార్యదర్శి కుంజ నాగలక్ష్మి, యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మిడ్డే మీల్ వర్కర్లు, స్కూల్ స్వీపర్ల సంయుక్త సమావేశం సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో గొంది దుర్గమ్మ, సీత అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి, సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం, పాఠశాల పరిసరాలు శుభ్రపరచడం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మిడ్డే మీల్ వర్కర్స్, స్కూల్ స్వీపర్లు చాలీచాలని గౌరవ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పాఠశాలలో మెనూ అమలు చేయడానికి, గ్యాస్ సిలిండర్ వంటకు అవసరమైన వస్తువులు సొంతగా అప్పు తీసుకొచ్చి కొనడంతో త్వరగా బిల్లులు రాక అప్పు తీర్చలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వంట చేయడానికి కొన్ని స్కూల్స్‌లో నీటి సౌకర్యం, వంట షెడ్స్ లేకన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంటకు అవసరమైన గ్యాస్ సిలిండర్, మెనూ వస్తువులు ప్రభుత్వమే సరఫరా చేయాలని, స్కూల్ స్వీపర్లకు గ్లౌజ్, మాస్క్, చీపుర్లు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, బకాయి వేతనాలు, బిల్లులు చెల్లించాలని, లేకుంటే మిడ్డే మీల్ వర్కర్లను, స్కూల్ స్వీపర్లను ఐక్యం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మిడ్డే మీల్ వర్కర్లు నాగలక్ష్మి, కీర్తి, రత్తమ్మ, లక్ష్మి, స్కూల్ స్వీపర్లు కమల, మహాలక్ష్మి, మేఘన పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటాం

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ తెలిపారు. మండలంలోని ప్రగడవరం టిడిపి కార్యకర్త మానే పల్లి రాజారావు కుమారుడికి విజయవాడ మణి పాల్ హాస్పిటల్‌లో ఆపరేషన్ జరిగింది. ఎంఎల్ఎ శనివారం మణిపాల్ హాస్పిటల్‌కు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.


పరామర్శిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ఏలూరులో 14న మెగా జాబ్‌మేళా


ఏలూరు సిటీ : ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మెగా జాబ్ మేళా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం శనివారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈ నెల 14న ఉదయం 9.30 గంటల నుంచి ఏలూరు సి.ఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా జరుగుతుంది. ఈ జాబ్ మేళాకు 39కి పైగా కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరై మూడు వేల మందిని అర్హత ప్రామాణికంగా పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బిఫార్మసీ, ఎంఫార్మసీ, బిటెక్, తదితర కోర్సులు పూర్తి చేసిన వారిని ఆయా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. అర్హత గల అభ్యర్థులందరూ ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవచ్చు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ లింకు https://naipunyam.ap.gov.in/user-registrationలో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 9493482414, 8978524022, 8143549464, 9618194377, 9885519299 సంప్రదించవచ్చు.

ఘనంగా బడేటి బుజ్జి జయంతి వేడుక

పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గ చరిత్రలో తనదైన శైలిలో ప్రజా సేవ చేసి, చెరగని ముద్ర వేసుకున్న మాజీ ఎంఎల్ఎ కీర్తిశేషులు బడేటి బుజ్జి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి కొనియాడారు. తన ఐదేళ్ల కాల పరిమితిలో తాను అనుకున్న లక్ష్యాలను సాధించి, ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఏలూరు పవర్ పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ, కీర్తిశేషులు బడేటి బుజ్జి 61వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి విగ్రహానికి ఆయన సోదరులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఇతర నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అభిమానులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఎంఎల్ఎ చంటి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 -19 మధ్య నియోజకవర్గంలో అభివృద్ధితో కూడిన సుపరిపాలన అందించిన ఘనత మాజీ ఎంఎల్ఎ బడేటి బుజ్జికే దక్కుతుందన్నారు. తన తండ్రి బడేటి శ్రీహరిరావు, అన్న బడేటి బుజ్జి ఆశయాల సాధనకు రాజకీయాల్లోకి వచ్చానని, తన లక్ష్య సాధన దిశగా ఎన్ని అటుపోట్లు ఎదురైనా కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. 22 మందికి రూ.14.94 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను, ఇద్దరికి తోపుడు బండ్లను, నలుగురికి వీల్ ఛైర్లను, ఇద్దరికి కుట్టు మిషన్లను, ఇద్దరికి చెవిటి మిషన్లను, ట్రై సైకిళ్లు, ఒకరికి ల్యాప్ టాప్, ఒకరికి వైద్యం నిమిత్తం రూ.పది వేలు, 250 మంది జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫాం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎంఎసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్లు వందనాల దుర్గాభవాని, పప్పు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఉప్పాల జగదీష్ బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, సీనియర్ నాయకులు బెల్లపుకొండ కిషోర్, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



బడేటి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ చంటి